# సికిల్‌సెల్‌పై ప్రత్యేక కార్యాచరణ

- సామాజిక సమస్యగా అసాధారణ వ్యాధి
- రక్తహీనతపై అప్రమత్తత అవసరం
- ప్రజా క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు

**కపిలేశ్వరపురం:** కొన్ని వ్యాధులు ప్రకృతి సిద్ధంగా సంక్రమిస్తాయి. వాతావరణ మార్పులు అందుకు కారణం కావొచ్చు. మరికొన్ని వ్యాధులు కుటుంబ వ్యవస్థ అమరిక కారణంగా సంక్రమించొచ్చు. సామాజిక సమస్య నుంచి వచ్చే అలాంటి వ్యాధుల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఒకటి. మేనరికమనే సంబంధం వ్యాధికారకం కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో రక్తహీనత సమస్య తరచూ ఆరోగ్య సమస్యగా తీవ్రం కావడం తరచూ చూస్తుంటాం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రక్తహీనతపై ప్రచార కార్యక్రమాలను చేపడుతుంది. ఇటీవల ప్రపంచంలో చర్చనీయాంశంగా మారిన సికిల్‌సెల్ ఎనీమియాపై సైతం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది.

**ఇతర సమస్యలకు మూలం**

మహిళల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వారిలో రక్త హీనత సమస్య పరిష్కారానికై పాఠశాల స్థాయిలోనే విద్యార్థినుల ఆరోగ్య వివరాలను సేకరించడం, అందుకు తగిన చికిత్సను అందించడం అవసరమని గుర్తించారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అనీమియా ముక్త్ భారత్ పథకాన్ని అమలు చేస్తుంది. అనారోగ్యం పాలైన సాధారణ రోగులతో పాటు విద్యార్థులు, పెద్ద వయస్సు గల ఆడవారికి సైతం రక్త పరీక్షలు చేసి రక్తహీనత నివారణకై ఈ పథకం ద్వారా కృషి చేస్తున్నారు. రామచంద్రపురం మండలంలోని ఒక ఏరియా ఆసుపత్రి నాలుగు పీహెచ్‌సీలు, కె.గంగవరం మండలంలోని నాలుగు ఆసుపత్రులు, మండపేట మండలంలో ఒక సీహెచ్‌సీ, నాలుగు పీహెచ్‌సీలు, కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీలు, రాయవరం మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనతపై ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు.

**సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలివి**

రక్తకణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది. కళ్లు పసుపురంగులోకి మారతాయి. తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట సంభవిస్తుంది. అంటువ్యాధులు సంక్రమించడమూ, శరీర అవయవాలు దెబ్బతినటడం జరుగుతుంటాయి. వీపు, కాళ్లు, ఛాతీ భాగాల్లో విపరీతమైన నొప్పి వస్తుంటుంది. విరేచనాలు, జ్వరం, డీహైడ్రేషన్ లక్షణాలు, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు నొప్పులను మరింత తీవ్రం చేస్తాయి.

**సికిల్‌సెల్ వ్యాధికి కారణాలివి**

జన్యుపరమైన ఎర్ర రక్తకణాల రుగ్మతను సికిల్‌సెల్ ఎనీమియా అంటారు. శరీర కణజాలానికి ప్రాణ వాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్తకణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడంతో రక్త నాళాలు మూసుకుపోయి ప్రమాదం వాటిల్లుతుంది. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారిని వ్యాధి ఆశిస్తుందన్నారు. వ్యాధి సోకిన వారిలో ఒక జన్యువు కొడవలి ఆకారంలోనూ, మరొకటి సాధారణ ఆకారంలోనూ ఉన్నట్టయితే వారిని సికిల్‌సెల్ క్యారియర్లు అంటారు. వారికి ఎలాంటి అనారోగ్యమూ కలగదు. కానీ ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరికి జన్మించే సంతానంలో రెండు జన్యువులు కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పుట్టిన తర్వాత 5–6 నెలలు వరకూ వ్యాధి లక్షణాలు బయటపడవు. సాధారణంగా రక్తకణాలు 120 రోజుల వరకూ జీవించి ఉంటాయి. కాని సికిల్‌సెల్ వ్యాధి బారినపడిన పిల్లల్లో 20–25 రోజులు మాత్రమే ఉంటాయి. రక్తకణం ఆకారం కొడవలి ఆకారంలో ఉండటంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించకపోవడమూ, సరైన మందులు లభ్యం కాకపోవడంతో ప్రాణవాయువు అందక 15 ఏళ్లలోపే చనిపోతున్నారు.


అంగర పీహెచ్‌సీ పరిధిలో రక్తనమూనాను సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**వ్యాధి కట్టడి ఇలా...**

గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి వ్యాధి సోకుతున్నట్టు గుర్తించారు. పెళ్లి చేసేముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు. క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ఇలా...**

2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులందజేస్తుంది. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను చేపడుతున్నారు. అవగాహన కల్పించడం, నిర్ధారణకై పరీక్షలు చేయడం, వ్యాధి సోకినవారికి కౌన్సెలింగ్ నిర్వహించడమనే కార్యాచరణను చేస్తున్నామని రెండు నియోజకవర్గాల్లోని వైద్యాధికారులు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డేను పాటిస్తున్నాయన్నారు.

### రక్త నమూనా పరీక్షలు చేస్తున్నాం




సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గుర్తింపునకై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో రక్త నమూనాలు సేకరిస్తున్నాం. విద్యార్థి దశ నుంచి రక్తహీనతపై దృష్టి సారించాలి. ప్రభుత్వం చేస్తున్న కృషికి తల్లిదండ్రులు సైతం సహకరించాలి. తరచూ విద్యార్థిని ఆరోగ్యం విషయంలో మార్పులను గమనిస్తుండాలి. రక్తహీనత సమస్య పరిష్కారం కోసం ఆహారంలో ఆకుకూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తపడాలి. మోతాదుకు తగినట్టు మాంసాహారాన్ని అందిస్తుండాలి. పెద్దవారు ఆహారంతో పాటు జీవనశైలిలో సైతం మార్పులు చేసుకోవాలి. – పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

## సమ్మర్ క్యాంపు ప్రారంభం


సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులతో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

**రాయవరం:** మండలంలోని పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఆరు నుంచి 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు ప్రత్యేకంగా సమ్మర్ క్యాంపును ప్రారంభించినట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఆయా అసోసియేషన్ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి తెలిపారు. మొదటి రోజు 25 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్లు విష్ణుకుమారి పాల్గొని మాట్లాడుతూ సమ్మర్ క్యాంపును చిన్నారులు సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూటీఎఫ్ సౌజన్యంతో స్నాక్స్, మజ్జిగ పంపిణీ చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ సత్యవేణి, ఎస్.సత్య, ఉపాధ్యాయులు కడలి శ్రీనివాస్, కిలపర్తి శ్రీనివాసరావు, వెత్సా గోపీకృష్ణ, నల్లమిల్లి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మ తీర్థం


భక్తుల నీరాజనాలు అందుకుంటున్న పోలేరమ్మ

**రాయవరం:** మండలంలోని వెదురుపాకలో పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు నీరాజనాలు అర్పించారు. పోలేరమ్మ అమ్మవారికి సోమవారం రాత్రి వైభవంగా జాతర నిర్వహించారు. ఉదయం వరకు జాతర జరగ్గా అమ్మవారిని అత్తవారింటికి సాగనంపే కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. గరగల రూపంలో ఉన్న అమ్మవారిని ఎత్తుకున్న ఆసాదులు అత్తవారింటికి వెళ్లనంటూ మారం చేస్తుండగా భక్తులు వారిని బలంగా పంపే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు అమ్మవారిని మధ్యాహ్నానికి అత్తవారింట సాగనంపారు. అమ్మవారిని అత్తారింటికి సాగనంపే సమయంలో వాసవీ క్లబ్ ఆధర్యంలో మజ్జిగ, విజయదుర్గా పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. జాతర పురస్కరించుకుని గారడీలు, బ్యాండు మేళాలను ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తమ పిల్లా పాపలను, పాడిపంటలను, పసుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. అమ్మవారికి చీరలు, రవికలు అందజేశారు. పోలేరమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు సత్తి వీరవెంకటరెడ్డి, సభ్యులు జాతర, తీర్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెదురుపాక, కొంకుదురు, నదురుబాద, వి.సావరం, రాయవరం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

**కాజులూరు:** రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును ప్రభుత్వం వేగవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మండలంలోని దుగ్గుదురులో మంగళవారం రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో మిల్లర్లు దళారుల ద్వారా రూ.1550 కే కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా జరిగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జట్టీలు లేకపోవటంతో పీఎంఆర్ ద్వారా విక్రయాలు జరగడం లేదన్నారు. మండలంలో సుమారు 80 శాతం మాసూళ్లు పూర్తవగా 40 శాతం ధాన్యం మాత్రమే మిల్లులకు చేరిందని మిగిలిన ధాన్యం పొలాల మధ్య దిమ్మలపైన, గట్లపైన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉందన్నారు. ఈ విషయంపై స్థానిక కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాటా, జట్టును ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రోత్సహించాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలురైతు సంఘం నాయకులు దండంగి సమర్పణరావు, బిల్లా సూరిబాబు, అంగడి ఈశ్వరరావు, దండంగి సత్యనారాయణ, దంగేటి అప్పారావు, ఎస్.ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో గడ్డికి నిప్పంటించవద్దు

**కాజులూరు:** పొలాల్లో వృథాగా పడి ఉన్న ఎండుగడ్డికి రైతులు పొరపాటున కూడా నిప్పంటించవద్దని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని కాజులూరు, తిప్పరాజుపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి అశోక్ పర్యటించారు. తిప్పరాజుపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ ఇటీవల వరి కోత మెషీన్ల ద్వారా రైతులు ఎక్కువగా దాళ్వా మాసూళ్లను నిర్వహిస్తున్నారన్నారు. వరి కోత మెషీన్లు ధాన్యాన్ని తుంచి వరి మొక్కలను తునాతునకలు చేసి పొలాల్లో చెల్లాచెదురుగా పడవేస్తుందన్నారు. ఈ గడ్డి పశువుల మేతకు అనుకూలంగా లేకపోవటంతో రైతులు ఈ ఎండుగడ్డికి నిప్పంటిస్తున్నారన్నారు. దీని వలన మండల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ధాన్యం రాశులు, గడ్డివాములు, ఇల్లు అగ్నికి ఆహుతైన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. వృథా గడ్డికి నిప్పంటించడం వలన ప్రమాదాలు జరగడమే కాకుండా పొలాల్లో మట్టి భూసారం కోల్పోతుందన్నారు. రైతులు అవగాహనతో వ్యవహరించాలన్నారు.

## వైభవంగా పళ్లాలమ్మ తీర్థమహోత్సవాలు


వానపల్లిలో పళ్లాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

**కొత్తపేట:** మండలంలోని వానపల్లి గ్రామ దేవత, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పు పళ్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరిగే తీర్థ మహోత్సవాలకు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు చేశారు. సోమవారం తాళ్లు లేపి ఉయ్యాల మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. స్థానిక యూనియన్ బ్యాంకులో ఉన్న అమ్మవారి బంగారం, వెండి ఆభరణాలను తీసుకువచ్చి అలంకరించారు. రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునుంచి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. దేవస్థానం తరపున పూజారులు మహాకుంభాభిషేకం జరిపారు. సాయంత్రం సిరిమాను ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు, అధికారులు, కోనసీమ ప్రాంతం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. భక్తులందరికీ పులిహోర ప్రసాదం, మజ్జిగ సరఫరా చేశారు. పలు సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర బందోబస్తు నిర్వహించారు.

## భానుడి భగభగలు


పసలపూడిలో ముఖానికి స్కార్ఫ్ కట్టుకుని ప్రయాణిస్తున్న ప్రయాణికులు

**అల్లాడుతున్న ప్రజలు**

**రాయవరం:** భానుడు ఏ మాత్రం తగ్గడం లేదు. నడినెత్తిన నిప్పుల వర్షం కురిపిస్తున్నట్లుగా తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. తీవ్రమైన ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కబోత పెరిగిపోతోంది. అగ్నికి ఆజ్యం తోడన్నట్లుగా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు మాదిరిగానే మంగళవారం కూడా సూరీడు నిప్పులు కక్కాడు. వాతావరణంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ అంతకు మించి వేడి వాతావరణం నెలకొంది. పెరిగిన ఉష్ణోగ్రతలు, వేడి గాలులకు నీడనున్న వస్తువులు కూడా వేడెక్కి పోతున్నాయి. రాత్రి సమయంలో కూడా వాతావరణంలో వేడి తగ్గడం లేదు. అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోతకు వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండవేడిమితో పాటు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

**ముసుగువీరులుగా ప్రయాణికులు**

ఉదయం 8 గంటలకే దినకరుడు తన ప్రభావాన్ని చూపిస్తున్నాడు. రహదారులన్నీ కర్ఫ్యూ వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. వడగాల్పు తగలకుండా ముఖానికి గుడ్డలు కప్పుకుని ముసుగువీరులుగా ప్రయాణికులు మారుతున్నారు. ఎండలు ముదిరిపోవడంతో కూలీలు పనులకు వచ్చేందుకు విముఖత చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం


పెదపాలెంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు

**అయినవిల్లి:** క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్లు గన్నవరపు శ్రీనివాసరావు, పినిపే శ్రీకాంత్ అన్నారు. అయినవిల్లి మండలంలోని ఎస్.పెదపాలెంలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. తొలుత దివంగత మాజీ సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబాజీపేట వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత క్రీడలపై ఆకర్షితులు అవ్వడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ×ఆడుదాం ఆంధ్ర× పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉత్సాహం పెంపొందించారన్నారు. వారిలో క్రీడల పట్ల ఆశక్తి పెరిగేలా షీల్డ్‌లు, బహుమతులు ప్రభుత్వం తరపున అందించారన్నారు. కోఆర్డినేటర్లు గన్నవరపు శ్రీనివాసరావు, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ క్రీడల శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. క్రీడలతో యువత ఎండార్పిన్లు విడుదలై నూతనోత్సాహం నింపుతుందన్నారు. అంబాజీపేట మండల యువత వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ పేరుతో ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అద్దరి


రావులపాలెంలో నియోజకవర్గ కాపు ఉపాధ్యాయుల కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న సహచరులు

**ఆలమూరు/రావులపాలెం:** కొత్తపేట నియోజకవర్గ కాపు ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షుడిగా మంగళవారం మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన అద్దరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ కాపు సంఘ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేయగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 78 మంది కాపు సామాజికవర్గానికి చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో సభ్యులంతా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అడపా శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా అక్కిరెడ్డి సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాపు సామాజిక వర్గంలోని పేద విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తానని నూతన కార్యవర్గం హామీ ఇచ్చింది. నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ పూలమాలలు వేసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

---

### క్లుప్తంగా

### ముగిసిన కల్యాణ పూజలు


కపిలేశ్వరపురంలో శ్రీపుష్పయాగం పూజలు చేస్తున్న అర్చకులు

**కపిలేశ్వరపురం:** స్థానిక దుర్గామాతా సమేత పార్వతీ పాపవినాశేశ్వర స్వామి, పార్వతీ సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి దివ్య కల్యాణ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ అర్చకుడు కాలధరి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో శ్రీపుష్పయాగం పూజలు చేశారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ నెల 8 నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల నిర్వహణకు సహకరించిన భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

### అన్నవరం స్వామి పూజకి సురుచి స్వీట్స్


అన్నవరం స్వామికి సమర్పించిన స్వీట్లు

**కపిలేశ్వరపురం (మండపేట):** అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీపుష్పయాగం పూజకు తాపేశ్వరంలోని సురుచి ఫుడ్స్ నుంచి ప్రత్యేకంగా తయారుచేసిన 9 రకాల స్వీట్లు సమర్పించారు. స్వామి దివ్య కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపుష్పయాగం పూజలు చేశారు. స్వామికి పూజ చేసిన అనంతరం స్వీట్లను భక్తులకు ప్రసాదంగా వితరణ చేయనున్నారు. గత ఐదు సంవత్సరాలుగా సంస్థ నుంచి అన్నవరంలో స్వామి కల్యాణ పూజలకు స్వీట్లు పంపుతున్నట్టు సురుచి సంస్థ అధినేత మల్లిబాబు తెలిపారు.

### ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్



**కపిలేశ్వరపురం:** మండల ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకూ ఎంపీడీఓ బాధ్యతలు నిర్వహించిన కె.రత్నకుమారికి తూర్పుగోదావరి జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి రావడంతో సోమవారం రిలీవ్ అయ్యారు. ఇప్పటి వరకూ కార్యాలయ ఏఓగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్న జి.రాజేంద్రప్రసాద్ ఇక నుంచి ఎంపీడీఓ బాధ్యతలను నిర్వహించనున్నారు. ఈయన గత ఏడాది అక్టోబర్ 7న ఏఓగా ఇక్కడకు వచ్చారు.

### గాంధీనగర్ మసీదు కమిటీ ఎన్నిక


ఎండీ రహీం

**కపిలేశ్వపురం (మండపేట):** మండపేట గాంధీ నగర్‌లోని జమాయితే ఇస్లామీ హింద్ అల్–అమీన్ మసీద్ కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ఎండీ రహీం (బ్రూసి)ను నియమించినట్టు సంస్థ మీడియా విభాగం మంగళవారం తెలిపింది. కమిటీ ఉపాధ్యక్షుడిగా రిజ్వాన్, కార్యదర్శిగా అబ్దుల్ హమీద్, కోశాధికారిగా మహ్మద్ ఇబ్రహీం షరీఫ్, సభ్యులుగా సయ్యద్ మహబూబ్, మహ్మద్ అరిఫ్, అబ్దుల్ రహమాన్ నియమితులయ్యారు.

### వైభవంగా శ్రీపుష్పోత్సవం


ద్రాక్షారామలో దంపతి తాంబూలాలు అందజేస్తున్న ఆలయ అర్చకుడు

**రామచంద్రపురం రూరల్:** దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన రమా సత్యవతీ సమేత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లకు, స్వామివారికి కల్యాణ శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం దంపతులకు దంపతి తాంబూలాలు అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా అమ్మవార్ల జాతర

**మామిడికుదురు:** పెదపట్నంలంక, పాశర్లపూడి గ్రామాల్లో కొలువైన గ్రామ దేవతల జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పెదపట్నంలంక గిడుగువారిపాలెం గ్రామ దేవత వనువులమ్మ జాతర మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు.

పాశర్లపూడి గ్రామ దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్ల జాతర కూడా వైభవంగా జరిపించారు. చిత్ర, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ విన్యాసాలు, పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. రెండు గ్రామాల్లోని అమ్మవార్లకు మంగళవారం నైవేద్యాలు చెల్లించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

---

### రేపటితో ముగియనున్న ఆధార్ శిబిరాలు

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట పట్టణంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు రేపటితో ముగియనున్నాయి. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల 2వ సచివాలయంలోనూ, గొల్లలగుంటలోని ఒకటో సచివాలయంలోనూ నిర్దేశించిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ సేవలందిస్తున్నారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు బాల ఆధార్ నమోదు, 5–15 వయస్సు గల బాలబాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను శిబిరాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ నవీకరణ ప్రక్రియ చేస్తున్నారు.

**కపిలేశ్వరపురం మండలంలో...**

నేడు, రేపు కపిలేశ్వరపురం 2, అంగర 2, నేలటూరు గ్రామ సచివాలయాల్లో నవీకరణ ప్రక్రియను చేస్తారు. ఆయా కేంద్రాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్రలు నవీకరణ ప్రక్రియ చేస్తున్నారు.

### సర్పంచ్‌కు సతీ వియోగం


పిల్లి హిందూజా (ఫైల్)

**కె.గంగవరం:** మండలంలోని గుడిగళ్ల గ్రామ సర్పంచ్ పిల్లి దొరబాబు సతీమణి హిందూజా(31) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు పెట్టా శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్ చీకట్ల గోపాలం, ఎంపీటీసీ కోట సత్తిబాబు, శెట్టిబలిజ సంఘ నాయకులు నరాల ఏడుకొండలు, శ్యామ్ ప్రసాద్, పంపన సుబ్బారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సంతాపం తెలిపారు.

### మహిళా విభాగం సమావేశానికి హాజరు

**మామిడికుదురు:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం సమావేశం మంగళవారం తాడేపల్లిలో జరిగింది. ఈ సమావేశంలో పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ విధంగా విస్మరించిందో ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకు రావాలని సమావేశంలో సూచించారన్నారు. కూటమి వైఫల్యాలను గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారని రాజేశ్వరిదేవి తెలిపారు.

### భవన నిర్మాణ పనుల నిలుపుదల

**సఖినేటిపల్లి:** మండలంలోని శృంగవరప్పాడులో మంగళవారం అంతర్వేది నీలకంఠేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించిన భూమిలో అనధికార నిర్మాణ పనులను అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ నిలుపుదల చేయించారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ఉండడంతో ఏసీ సత్యనారాయణ ఈ చర్యలు తీసుకున్నారు. సర్వే నెం.124లో ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టినట్టు విషయం తెలుసుకుని, దేవదాయ శాఖ చట్టం, పై అధికారుల ఆదేశాలపై నిలుపుదల చేయించినట్టు ఆయన తెలిపారు.

### వెయ్యి లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

**కొత్తపేట:** ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరి లంకలో సారా తయారీకి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు, స్క్వాడ్ సీఐ ఎల్ చిరంజీవి, స్థానిక సీఐ కాత్యాయని పర్యవేక్షణలో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో భాగంగా బొబ్బర్లంక సమీపంలోని లంక సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లపుఊటను గుర్తించారు. ఇసుక దిబ్బల్లో పాతిపెట్టిన ఊట డ్రమ్ములను వెలికితీసి ఊటను ధ్వంసం చేశారు. అదే మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు సారా కేసుల్లో నమోదవగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై తెలిపారు.